# మాట నేర్పు



అరణ్యే నిర్జనే రాత్రౌ
అంతర్వేశ్మని సాహసే
న్యాసాపహ్నవనేచైవ
దివ్యా సంభవతి క్రియా

*భావం:* నిర్జనమైన అరణ్యంలో, రాత్రివేళ, ఇంటి మధ్య, (బందిపోటుతనం వంటి) సాహసమైన నేరాలలో, దాచుకున్న సొమ్ము అపహరించినప్పుడు దివ్యక్రియ ఉపయోగం సంభవిస్తుంది.

వెయ్యిమంది దోషులు తప్పించుకున్నా ఒక నిర్దోషిని శిక్షించరాదన్నది నేటి రాజనీతి. అక్కడక్కడ నిర్దోషులు శిక్షింపబడినా ఒక్క దోషిని కూడా వదలరాదన్నది ప్రాచీన రాజనీతి. న్యాయ విచారణ ఏళ్ళ తరబడి సాగించరాదన్నది కూడా ప్రాచీనులు నమ్మిన ధర్మ సూత్రం.

ఒక కవి రాజాశ్రయం కోరి రాజధాని చేరుకునే సరికి రాత్రయింది. సత్రం వెతుక్కుని భోజనమూ, వసతీ సంపాదించుకునే వీలు లేక రాత్రి ఒక ఇంటి అరుగు మీద పడుకున్నాడు. అతని దురదృష్టం కొద్దీ రాత్రి ఆ ఇంట్లో దొంగతనం జరిగింది. ఊరికి కొత్తవాడు కనుక రాజభటులు అనుమానించి అతణ్ణి బంధించి మర్నాడు మహారాజు ఎదుట నిలబెట్టారు.

మహారాజు స్వయంగా న్యాయ విచారణ ప్రారంభించాడు. నిందితుని వద్ద నగలు దొరకలేదు. అతను దొంగతనం చేస్తుండగా చూసిన వారు లేరు. అతను దోషి అని నిరూపించడానికి సాక్ష్యాధారాలు లేవు. తాను నిర్దోషినని నిరూపించడానికి కవి వద్దా ఏ సాక్ష్యమూ లేదు.

ఈ సమయంలో ఏం చెయ్యాలని మహారాజు మహామంత్రి వైపు చూశాడు. మంత్రి "మహారాజా, ఇటువంటి పరిస్థితిలో ఏం చెయ్యాలో నారద స్మృతిలో ఉంది. నిర్జనమైన అరణ్యంలో కానీ రాత్రి వేళ కానీ ఇంటి మధ్యలో కానీ సాహసం కావల్సిన బందిపోటుతనంలో కానీ దాచినసొమ్ము తిరిగి ఇవ్వకపోవడంలో కానీ జరిగిన నేరానికి సాక్ష్యముండదు. అప్పుడు దివ్య క్రియ ప్రయోగించి నిజం తెలుసుకోవాలి" అన్నాడు.

నిందితుడు ఒణికిపోయాడు. కాలుతున్న ఇనుపగుండును నిందితుని చేతిలో పెట్టి చెయ్యి కాలితే దోషిగానూ, కాలకపోతే నిర్దోషిగానూ నిర్ణయించడం దివ్యక్రియ.

ఎవరికైనా చెయ్యి కాలకుండా ఉంటుంది? ఆ ప్రశ్న అడగడానికి లేదు. మహారాజు చండశాసనుడు.

రాజు అతణ్ణి " ఏమైనా చెప్పుకుంటావా" అని ప్రశ్నించాడు.

కవికి ఒక్క విషయం జ్ఞాపకం వచ్చింది. రాజు చండశాసనుడే కాదు రసికుడు కూడా. ఇప్పుడు ధైర్యం చేస్తే కానీ ప్రాణం నిలవదు.

అతడు నారద స్మృతి లోని శ్లోకాన్ని కొద్దిగా మార్చి " నిర్జనమైన అరణ్యంలోని ఇంట్లో రాత్రి సాహసం చెయ్యడానికి సుందరాంగి లభిస్తే దివ్యంగా ఉంటుంది" అని పద్యం చదివాడు.

రసికుడైన మహారాజుకి పద్యంలోని సాహసి తానే అన్పించి మీసం దువ్వుకున్నాడు.

ఆయనలో ప్రేమ తరంగాలు ప్రవహించి సభ వాయిదా వేశాడు. అదృష్టవశాత్తు అసలు దొంగ దొరికాడు. కవికి రాజాశ్రయం లభించింది.

కవిగారి కథ సుఖాంతమైంది. సరే. అనుమానమున్నచోట దివ్య క్రియ ప్రయోగించి కొందరు నిర్దోషులను కూడా శిక్షించడం నయమా, ఎన్ని సాక్ష్యాధారాలున్నా అతి చిన్న అనుమానం కల్గితే చాలు నేటివలె పెద్ద నేరస్థులను కూడా వదిలెయ్యడం నయమా, పాలకులూ, పాలితులూ కూడా ఆలోచించాలి.

******